క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల ఆకస్మిక తనిఖీ



బోధన్‌టౌన్: పట్టణంలోని ఆరో వార్డులో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మంగళవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం అందించే నిధుల మంజూరులో జాప్యం ఉండకుండా చర్యలు చేపడుతామని, లబ్ధిదారులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఇరిగేషన్ ఏఈ, బల్దియా అధికారులు ఉన్నారు.

ప్లాస్టిక్ బ్యాగుల వాడకం నిషేధించాలి



ఆర్మూర్‌టౌన్: ప్రజలు ప్లాస్టిక్ బ్యాగుల వాడకం నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలోని 20వ, 24వ వార్డులో పారిశుధ్య, ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు అధికారులు, జవాన్లు, ఆశవర్కర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌లేని స్కూల్ బస్సులను నియంత్రించాలి



బోధన్: ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సుల రవాణాను నియంత్రించాలని కోరుతూ మంగళవారం బీసీ విద్యార్థి సంఘ నాయకులు స్థానిక ఎంవీఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. అనుభవం లేని డ్రైవర్లతో నడుపుతున్న స్కూల్ బస్సులను గుర్తించి సీజ్ చేయాలని పేర్కొన్నారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సంతోష్, నాయకులు నరేష్, గంగాధర్, సాయికుమార్, రోహిత్‌లు పాల్గొన్నారు.

ఏటీవో రాములు సేవలు మరువలేనివి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ డివిజన్ అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా పదవీ విరమణ పొందిన నీరడి రాములు సేవలు మరువలేనివని డీటీవో దశరథ్ అన్నారు. పెర్కిట్‌లో మంగళవారం నీరడి రాములు పదవీ విరమణ కార్యక్రమానికి డీటీవో హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ నాయకులు మారుతి, టీజీవోస్ నాయకులు అలుక కిషన్, పీఆర్టీయూ నాయకులు పొద్దుటూరి మోహన్ రెడ్డి, పలువురు ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపిక



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మినిమి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఉప్లూర్ గ్రామానికి చెందిన యెనుగందుల సామిత్ జాతీయ స్థాయి అండర్-19క్రికెట్‌పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. జూన్ 7,8 తేదీలలో ఆసిఫాబాద్‌లో రాష్ట్ర ఫిఫ్టీ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సామిత్ ప్రతిభచాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరిగే 3వ జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున సామిత్ పాల్గొంటారని తెలిపారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవ్, పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్, ఉపాధ్యాయ బందసభ్యులు సామిత్‌ను అభినందించారు.

వర్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా నగేశ్ ఎన్నిక



వర్ని: వర్ని మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పాత వర్ని గ్రామానికి చెందిన అతిమల నగేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వర్నిలో సభ్యులు నగేశ్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏడాది కాలంపాటు అధ్యక్షుడిగా నగేశ్ కొనసాగనున్నారు.

యూరియా కోసం ఆందోళన

- ఆర్మూర్ సొసైటీ వద్ద గంటల తరబడి నిల్చున్నా అందని వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



ఆర్మూర్ సొసైటీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్ ప్రాంతంలోని రైతులు యూరియా కొరతతో గంటల తరబడి సొసైటీల వద్ద పడిగాపులుగాస్తున్నారు. ఆర్మూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట సీజన్‌కు సరిపడేంత యూరియా రావడం లేదని రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఆర్మూర్ సొసైటీ పరిధిలో సుమారు 1000 ఎకరాల్లో వర్షకాలం సీజన్‌కుగాను రైతులు మొక్కజొన్నను సాగు చేస్తుండగా, ఎకరాకు రెండు బస్తాల యూరియా అవసరమవుతుంది. ఈ విషయమై సొసైటీని సంప్రదించగా నాలుగు రోజుల నుంచి యూరియా వస్తుందని చెబుతూ వచ్చారు. కాగా, మంగళవారం 450 బస్తాలతో యూరియా లోడ్ వచ్చింది. కాగా అప్పటికే సొసైటీ వద్ద ఉదయం 5గంటల నుంచి 400 మంది రైతులు యూరియా కోసం వేచిచూస్తున్నారు. ఒక్కసారిగా రైతులు యూరియా కోసం ఎగబడటంతో తోపులాట జరిగింది. కేవలం 100 మందికి యూరియా అందింది. ఈ సందర్భంగా రైతు నాయకులు జిల్లా వ్యవసాయ శాఖ, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించిన సొసైటీ వద్దకు ఎవరు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై సొసైటీ అధికారులను వివరణ కోరగా రెండు రోజుల్లో మిగితా రైతులకు యూరియా అందుతుందన్నారు.

కొరత లేకుండా చూడాలి



మొక్కజొన్న పంటకు యూరియా కచ్చితంగా అవసరం ఉటుంది. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు సకాలంలో యూరియా అందడం లేదు. – శ్రీను, రైతు,ఆర్మూర్

యూరియా అందలేదు



యూరియా కోసం సొసైటీ వద్ద ఉదయం 5గంటల నుంచి నిలుచ్చున్నాం. ఒక్క యూరియా బ్యాగు అందలేదు. వ్యవసాయ పనులు వదిలేసి వచ్చాం. సకాలంలో యూరియా అందించాలి. – నూతుల శ్రీనివాస్, రైతు. ఆర్మూర్

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత

- ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి
- ఎడపల్లి గురుకుల కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థినులకు అభినందన



ఎడపల్లిలో విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్: విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మంగళవారం ఎడపల్లిలోని గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విద్యార్థులను సన్మానించి అభినందించారు. కొత్తగా ప్రవేశ పెట్టిన ఓకేషనల్ అగ్రికల్చర్ ,బ్యూటీ వెల్‌నెస్ కోర్సులకు సంబంధించిన ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కళాశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కోర్సులకు ప్రభుత్వం రూ.3 లక్షల విలువ చేసే పరికరాలను అందించింది.రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, రజితయాదవ్, సొసైటీ చైర్మన్ పోల మల్కారెడ్డి, నాయకులు కళాశాల ప్రిన్సిపల్ గంగాశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

బోధన్, సాలూర, ఎడపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ శశిభూషణ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మైనారిటీ నాయకులు కాంగ్రెస్‌లో చేరిక

బోధన్: పట్టణ కేంద్రానికి చెందిన సీనియర్ న్యాయవాది, బీఆర్‌ఎస్ మైనారిటీ నాయకుడు అబిద్ అహ్మద్ సోఫీ ఆయన పలువురు అనుచరులు మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మోహినోద్దీన్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పాటించాలి



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

బాల్కొండ: పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మండలంలోని నాగాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గదులను పరిశీలించారు. విద్యార్థుల కోసం చేస్తున్న వంటను పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కేజీబీవీ పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీధర్, ఎంఈఓ రాజేశ్వర్, స్పెషల్ ఆఫీసర్ భవాని, సిబ్బంది తదితరులున్నారు.

అసంపూర్తిగా జేఎన్‌సీ బస్‌షెల్టర్



రుద్రూర్: మండలకేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న బస్‌షెల్టర్‌ను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. స్వచ్ఛంద సంస్థ సంస్కార్, ప్లాన్ ఆధ్వర్యంలో బస్‌షెల్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగా, సంస్కార్, ప్లాన్ కార్యక్రమాలు ముగియడంతో బస్‌షెల్టర్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. జవహర్ నగర్ కాలనీలో రెండు ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వివిధ పట్టణాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు బస్టాండ్‌కు వెళ్లాలంటే అర కిలోమీటర్ దూరం నడవాల్సి ఉంటుంది. లయన్స్ క్లబ్ లాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి బస్‌షెల్టర్ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతను పూడ్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



రెంజల్(బోధన్): రెంజల్ మండల శివారులోని రెంజల్-ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్ ప్రధాన రహదారి పై ఏర్పడిన గుంతను అధికారులు పూడ్చివేయించారు. గత నెల 29న ప్రచురితమైన ప్రమాదకరంగా రోడ్డు గుంత వార్తకు ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మంగళవారం గుంతను పూడ్చి వేయించారు. డస్టుతో గుంతను పూడ్చి వేయించడంతో వాహనదారులు, స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

వైద్యులు దేవుళ్లతో సమానం



రుద్రూర్‌లో వైద్యుడిని సన్మానిస్తున్న నాయకులు

బాల్కొండ/రుద్రూర్/మాక్లూర్/వర్ని/ఆర్మూర్ టౌన్/నందిపేట్/బోధన్ : వైద్యం అందించే వైద్యులు దేవుళ్లతో సమానమని లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని రుద్రూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ బాల్కొండ, భవాని, కోటగిరి లయన్స్ క్లబ్‌లు, అభయ హస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు చోట్ల వైద్యులను సన్మానించారు. అనంతరం మొక్కలు నాటారు. ఆర్మూర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకుల, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం చేశారు. మాక్లూర్ మండలం కల్లెడి, మోస్రా, నందిపేట పీహెచ్‌సీల్లో వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.



ఆర్మూర్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఆర్మూర్ ఎమ్మెల్యే



రామచంద్రరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: హైదరాబాద్‌లో బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన రామచంద్రరావుకు రాకేశ్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో స్థానిక ఎన్నికల్లో జిల్లాలో ఎంపీ అర్వింద్ ఆధ్వర్యంలో జెడ్పీచైర్మన్, మున్సిపల్ చైర్మన్ స్థానాలను కైవసం చేసుకుంటామన్నారు.

నేటి చిత్రం

రోడ్డుపైనే చెత్త..



నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని పాతూరులో రోడ్డుపైనే చెత్త వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది డ్రెయినేజీ నుంచి చెత్తను రోడ్డుమీద వేయడంతో కాలనీవాసులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై నుంచి చెత్తను తొలగించాలి.

– మోతిలాల్, పాతూర్, నందిపేట్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

హడలెత్తిస్తున్న కుక్కలు

- వెంబడించడంతో ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- బాల్కొండ ఉమ్మడి మండలంలో భయపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రెంజర్లలో సంచరిస్తున్న వీధి కుక్కలు

బాల్కొండ: బాల్కొండ ఉమ్మడి మండలంలో కుక్కలు గుంపులుగుంపులుగా సంచరించడంతో ప్రజలు హడలిపోతున్నారు. వాహనదారులను కుక్కలు వెంబడించడంతో కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. సోమవారం మెండోరా మండలం పోచంపాడ్‌లో ముగ్గురిపై, 15 రోజుల క్రితం మెండోరా మండలం సావెల్‌లో, బాల్కొండ మండల కేంద్రంలో పలువురిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. పిచ్చి కుక్కల స్వైర విహారంతో వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వీధి కుక్కల స్వైర విహారంపై పంచాయతీల్లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పోచంపాడ్‌లో కుక్కకాటు బాధితుడు (ఫైల్)

ఆదాయం వస్తున్నా.. కానరాని అభివృద్ధి



శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్లు

- బడాపహాడ్ దర్గాలో వసతులు కరువు
- పట్టించుకోని వక్ఫ్ బోర్డు



వృథాగా ఉన్న తాగునీటి ట్యాంక్

వర్ని: జిల్లాలోని బడాపహాడ్ దర్గాలో కనీస సౌకర్యాలు కల్పించడంలో వక్ఫ్‌బోర్డు పూర్తిగా విఫలమైంది. ప్రతి ఏడాది మూడు కోట్ల 60 లక్షల రూపాయలు ఆదాయం వస్తున్న బడాపహాడ్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం అధికారుల, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఏళ్ల క్రితం నిర్మించిన ఆరు రేకుల షెడ్లు పూర్తిగా ధ్వంసమైన వాటిస్థానంలో కొత్త వాటిని నిర్మించలేదు. భక్తులకు విడిది కోసం విశ్రాంతి గృహాలు లేవు. స్నానం చేయడానికి, తాగడానికి నీటి సౌకర్యం లేదు. మూత్రశాలలు లేవు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఈవిషయమై జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు భక్తులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న ప్రభాకర్

రుద్రూర్/కమ్మర్‌పల్లి/ఆర్మూర్‌టౌన్ : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, ఈ విధానాలకు నిరసనగా ఈ నెల 9న కోటగిరి తహసీల్ కార్యాలయం వద్ద నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఏ. విఠల్ గౌడ్ పిలుపునిచ్చారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటల పని చేయాలనే ఆదేశాలు జారీ చేస్తున్నారని అన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ప్రభాకర్ అన్నారు. కమ్మర్‌పల్లిలోని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్మూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్మిక సంఘాల సమావేశంలో ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, టీయూసీఐ, ఏఐటీయూసీ నాయకులు దాసు, వెంకటేష్, ముత్తన్న, ఎల్లన్న, సూర్యశివాజీ, సుధాకర్ మాట్లాడారు. రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన బోధన్ నాయకులు



బోధన్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు రాంచంద్రరావును మంగళవారం హైదరాబాద్‌లో బోధన్‌కు చెందిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు న్యాయవాది నర్సింహారెడ్డి, నాయకులు రంగారావు, దామోదర్, అశోక్ గౌడ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడు రాంచంద్రరావుకు వీరు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్తం

మంత్రి సీతక్కను కలిసిన ఎన్ఎస్‌యూఐ బోధన్ నియోజకవర్గ అధ్యక్షుడు



బోధన్: జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క విచ్చేశారు. ఈసందర్భంగా మంత్రి సీతక్కను సాలూర మండలం ఖాజాపూర్ గ్రామానికి చెందిన ఎన్ఎస్‌యూఐ బోధన్ నియోజక వర్గ అధ్యక్షుడు అనిల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



నవీపేట : మండలంలోని నాళేశ్వర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన నెమ్మి కాత్యాయని మంగళవారం కంప్యూటర్‌ను వితరణ చేశారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి ఆర్మూర్ మారుతి చొరవతో రూ. 50 వేల విలువైన కంప్యూటర్‌ను పాఠశాల హెచ్ఎం శ్రీపాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, మాజీ సర్పంచ్ ద్యాగస రిన్, విద్యాకమిటీ చైర్మన్ భూలక్ష్మి, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు ..

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ముప్కాల్ మండలకేంద్రానికి చెందిన పాండురంగా బక్ స్టాల్ నిర్వహకులు రూ. 10 వేల విలువ చేసే నోట్ పుస్తకాలను అందజేశారు. వాటిని పాఠశాలలో హెచ్ఎం శమంత చేతుల మీదుగా పంపిణీ చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

నందిపేట్(ఆర్మూర్): స్థానిక ఎమార్సీ కేంద్రంలో మంగళవారం ఎంఐఎస్ కోఆర్డినేటర్ బత్తుల రాజేశ్ సంతాప సభను నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజేశ్ సోమవారం రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కే రాజు మాట్లాడారు.

రేపటి నుంచి అఖండ హరినామ సప్తాహం

వేల్పూర్: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఈనెల 3 నుంచి 10 వరకు పంచమ వార్షికోత్సవంలో భాగంగా అఖండ హరినామ సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, కంకణాల రాజేశ్వర్, అశోక్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులను ఉద్దేశించి రాఘవేంద్రస్వామి ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందన్నారు.భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి వారు కోరారు.